


VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 58 | మంగళవారం 28 జూలై 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు మద్దతుగా రేవంత్ సర్కార్..!




2

హైడ్రా చీఫ్ ఎ.వి.రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు మద్దతుగా ప్రభుత్వం నిలవాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ అంశంలో లీగల్ ఒపీనియన్ తీసుకోవాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## ఎల్‌నినో పై రైతులకు అవగాహన కల్పించండి



2

- ఎల్‌నినో ప్రభావం పై రైతుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్న సీఎం
- ప్రత్యామ్నాయ పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచన
- ప్రజల అంచనాలకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరు మారాలని స్పష్టీకరణ
- విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం నిపుణుల సేవలు తీసుకోవాలని ఆదేశం
- పనితీరు పై క్షేత్రస్థాయి అభిప్రాయాలను అధికారులకు వివరించిన సీఎం

## కేసులు ఎత్తివేయకుంటే..: కేంద్రానికి కాక్రోచ్ జనతా పార్టీ హెచ్చరిక

- ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని సీజేపీ ఆరోపణ
- ఢిల్లీ వెలుపల నిరసనకారుల పై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్
- అదుపులోకి తీసుకున్న వారిని వెంటనే విడుదల చేయాలన్న కాక్రోచ్ జనతా పార్టీ
- హామీలు అమలు చేయకుంటే తదుపరి చర్యలు తప్పవని హెచ్చరిక




2

## ఐరోపాలో కార్చిచ్చు, 3 లక్షల మంది తరలింపు.. ఫ్రాన్స్, స్పెయిన్‌లలో విలయం!

ఐరోపాను తీవ్రమైన కార్చిచ్చు భయపెడుతోంది. ఫ్రాన్స్‌లోని ప్రసిద్ధ ద్రాక్షతోటలు, వైన్ తయారీ కేంద్రాలకు పేరుగాంచిన బోర్డో నగరం వైపునకు దట్టమైన మంటలు వేగంగా దూసుకొస్తున్నాయి. దాంతో పాటు పక్కనే ఉన్న స్పెయిన్‌ను కూడా ఈ మంటలు తీవ్రంగా దహించివేస్తున్నాయి. పరిస్థితులు చేజారిపోవడంతో ఇరు దేశాల్లో కలిపి దాదాపు 3,00,000 మంది నివాసితులు తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు.



2

## డీఎస్సీ ఆరోపణల పై జగన్‌తో బహిరంగ చర్చకు నేను సిద్ధం



2

- వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్, భూకుంభకోణాల పైనా చర్చిద్దామని లోకేశ్ సవాల్
- జగన్‌కు 'క్రెడిట్ చోర్ డిజార్డర్' జబ్బు ఉందని ఎద్దేవా
- స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరుశాతం విజయమే లక్ష్యమన్న లోకేశ్
- కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేడర్‌కు పిలుపు

## హైకోర్టు సంచలన నిర్ణయం.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తొలగింపునకు ఆదేశాలు

- ఐజీ స్థాయి అధికారిని నియమించాలని సూచన
- చీఫ్ సెక్రటరీకి కోర్టు స్పష్టమైన ఆదేశాలు
- లోతుకుంబ భూవ్యవహారం పై విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు
- 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై తీవ్ర ఆగ్రహం
- బేషరతు క్షమాపణలు తెలిపిన రంగనాథ్

2



## రాజీనామా తర్వాత పార్లమెంట్‌కు వచ్చిన ధర్మేంద్ర ప్రధాన్

నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన బీజేపీ ఎంపీ ధర్మేంద్ర ప్రధాన్, ఇవాళ తొలిసారి పార్లమెంట్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఎన్డీయే మిత్రపక్షాల నుంచి అనూహ్య రీతిలో ఘన స్వాగతం లభించింది. మరోవైపు విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం జరిగిందంటూ విపక్షాలు పార్లమెంట్ ప్రాంగణంలోనే నిరసనకు దిగాయి. దీంతో పార్లమెంట్‌లో భిన్నమైన వాతావరణం కనిపించింది.



2

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 28 జూలై 2026

## కేసులు ఎత్తివేయకుంటే..: కేంద్రానికి కాక్రోచ్ జనతా పార్టీ హెచ్చరిక

నీట్ పేపర్ లీకేజీ, పరీక్షల అక్రమాలపై తాము చేపట్టిన ఆందోళన విరమణ సందర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సోమవారం ఆరోపించింది. ఢిల్లీ వెలుపల నిరసనకారులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, వివిధ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయాలని డిమాండ్ చేసింది. సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, అసోం, పశ్చిమ బెంగాల్, బీహార్ వంటి రాష్ట్రాల్లో విద్యార్థులు, నిరసనకారులను లక్ష్యంగా చేసుకుని అరెస్టులు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. "బీజేపీ లేదా ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో నిరసనకారుల పై ఎలాంటి శిక్షార్హమైన చర్యలు తీసుకోబోమని కేంద్రం హామీ ఇచ్చిన నేపథ్యంలోనే మేము మా దేశవ్యాప్త ఆందోళనను విరమించుకున్నాం. అయితే, ప్రస్తుతం వస్తున్న నివేదికలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకుని, అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేసేలా చూడాలని కోరారు. మంగళవారం లోగా లిఖితపూర్వక హామీ ఇస్తామన్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఒకవేళ హామీలను గౌరవించకపోతే తదుపరి కార్యాచరణ చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కేంద్ర మంత్రులతో జరిపిన చర్చల అనంతరం సీజేపీ తన 36 రోజుల సుదీర్ఘ ఆందోళనను శనివారం విరమించుకున్న విషయం తెలిసిందే. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, నిరసనకారులపై నమోదైన కేసులు ఎత్తివేస్తామన్న ప్రభుత్వ హామీల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఢిల్లీలో నమోదైన సుమారు 15 ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణపై ఉన్నతాధికారుల నుంచి అధికారిక ఆదేశాలు వచ్చాకే తదుపరి చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. మరోవైపు, బీహార్‌లోని సివాన్ లో నిరసనకారులపై ఏకే-47 ఎక్కుపెట్టిన ఒక కానిస్టేబుల్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

## ఐరోపాలో కార్చిచ్చు, 3 లక్షల మంది తరలింపు.. ఫ్రాన్స్, స్పెయిన్‌లలో విలయం!

ఫ్రాన్స్ 24 వార్తా సంస్థ కథనం ప్రకారం, దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 2,20,000 మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పర్యాటక ప్రాంతమైన క్యాప్ ఫెర్రెట్ పెనిన్సులాను దహించి వేసిన ఈ మంటలు ప్రస్తుతం బోర్డో నగరానికి కేవలం 15 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని మేయర్ థామస్ కాజెనేవ్ తెలిపారు. దాదాపు 8.5 లక్షల జనాభా ఉన్న బోర్డో నగరాన్ని ప్రస్తుతానికి ఖాళీ చేసే ప్రణాళికలు ఏవీ లేవని చెప్పినప్పటికీ, ముప్పు చాలా దగ్గరగా ఉందనే విషయాన్ని ఆయన అంగీకరించారు. ఫ్రాన్స్ హోంమంత్రి లోరెంట్ నూనెజ్ ఈ పరిస్థితిపై స్పందిస్తూ 'మంటలు ఏమాత్రం అదుపులో లేవు, మంటలు నగరం వైపు వేగంగా విస్తరిస్తున్నాయి. ముందెన్నడూ లేనంత అత్యంత ప్రతికూల పరిస్థితులను మనం ఎదుర్కొంటున్నాం' అని చెప్పారు. మరోవైపు, అర్ధరాత్రి వేళ మార్చేప్రిమ్, సెస్టాస్ వంటి ప్రాంతాల్లో పోలీసులు తలుపులు తట్టి ప్రజలను వెంటనే ఇళ్లు ఖాళీ చేయాలని అభ్యర్థిస్తున్న దృశ్యాలను అధికారులు విడుదల చేశారు.

**స్పెయిన్ చరిత్రలోనే అతిపెద్ద కార్చిచ్చు**

స్పెయిన్‌లోనూ పరిస్థితి అత్యంత భయానకంగా ఉంది. ఇప్పటివరకు 75,000 మందికి పైగా ఇళ్లను ఖాళీ చేయగా, మరో 30,000 మందిని ఉన్న చోటే సురక్షితంగా ఉండాలని అధికారులు ఆదేశించారు.

**భారీ నష్టం:** స్పెయిన్ పర్యావరణ మంత్రి సారా అగేసెన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒక్క అవిలా ప్రావిన్స్‌లోనే 50,000 హెక్టార్లకు (1,23,500 ఎకరాలు) పైగా తోటలు, చెట్లు బూడిదయ్యాయి. స్పెయిన్ ఆధునిక చరిత్రలోనే ఇది అతిపెద్ద కార్చిచ్చుగా నమోదైంది.

**ప్రకృతి వనరులు బూడిద:** కాస్టెల్లాన్ ప్రావిన్స్‌లోని సియెర్రా డి ఎస్పాడాన్ నేచరల్ పార్క్‌లోకి మంటలు విస్తరించి, వేలాది హెక్టార్ల అడవులను నాశనం చేస్తున్నాయి. తీవ్రమైన వేడి, గాలుల వల్ల మంటలను ఆర్పివేయడం సాంకేతికంగా చాలా కష్టంగా మారిందని వాలెన్షియా ప్రాంతీయ నేత జువాన్‌ఫ్రాన్ పెరెజ్ తెలిపారు.

**ఆందోళనకర గణాంకాలు:** ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు స్పెయిన్‌లో మొత్తం 1,50,000 హెక్టార్ల భూభాగం మంటలకు ఆహుతైంది. ఇది గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే 6 రెట్లు ఎక్కువ అని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ ఆందోళన వ్యక్తం చేశారు.

## మతం మారితే 'ఎస్సీ' హోదా కోల్పోయినట్లే

షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) వర్గానికి చెందిన వ్యక్తి ఇతర మతంలోకి మారితే వారి ఎస్సీ హోదా తక్షణమే రద్దవుతుందని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను కాదని క్రిస్టియానిటీ లేదా ఇతర మతాలను స్వీకరించిన వ్యక్తులకు ఎస్సీ రిజర్వేషన్లు, కుల ధ్రువీకరణ పత్రాలు చెల్లవంటూ గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. 1950 నాటి రాజ్యాంగ ఉత్తర్వుల ప్రకారం... హిందూ, సిక్కు, బౌద్ధ మతస్థులు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని, మతం మారిన మరుక్షణమే ఎస్సీ హోదా, దాని ఆధారిత ప్రయోజనాలు ముగుస్తాయని స్పష్టం చేసింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో ఎలాంటి పొరపాటు లేదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. పునఃపరిశీలన పిటిషన్ ను తోసిపుచ్చింది. ఒకవేళ ఎవరైనా తిరిగి ఎస్సీ హోదాను పొందాలంటే రాజ్యాంగం నిర్దేశించిన మూడు ప్రధాన నిబంధనలకు (పుట్టుకతో ఎస్సీ అయి ఉండటం, స్వచ్ఛందంగా తిరిగి సొంత మతంలోకి రావడం, మూల కుల సమాజం వారిని ఆమోదించడం) కట్టుబడి ఉండాలని ధర్మాసనం పేర్కొంది. సుప్రీంకోర్టు వెలువరించిన ఈ కీలక తీర్పు దేశవ్యాప్తంగా ఉన్న రిజర్వేషన్ విధానాలు, మత మార్పిడి వ్యవహారాలపై తీవ్ర ప్రభావం చూపనుంది.

# హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు మద్దతుగా రేవంత్ సర్కార్..!

హైడ్రా చీఫ్ ఎ.వి.రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు మద్దతుగా ప్రభుత్వం నిలవాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ అంశంలో లీగల్ ఒపీనియన్ తీసుకోవాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీంతో తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్‌ను న్యూఢిల్లీ పంపించారు. అలాగే గతంలో కోర్టు ధిక్కారణ పిటిషన్లను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. హైకోర్టు తీర్పు కాపీ అందిన తర్వాత.. సింగిల్ బెంచ్ తీర్పుపై డివిజన్ బెంచ్‌కు వెళ్లాలని యోజనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. లోతుకుంట భూముల కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌పై సోమవారం తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని తెలంగాణ హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని అభిప్రాయపడింది. ఆయన్ని తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది.

# ఎల్‌నినో పై రైతులకు అవగాహన కల్పించండి

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండనుందన్న అంచనాల నేపథ్యంలో, రైతులను అప్రమత్తం చేసి వారికి పూర్తిస్థాయిలో అండగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఆయన వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. "ఎల్‌నినో వల్ల ఎదురయ్యే పరిణామాలను రైతులకు స్పష్టంగా వివరించాలి. ఏ ప్రాంతంలో ఏ పంటలు వేయాలో సూచిస్తూ, వారిని ప్రత్యామ్నాయ సాగు వైపు ప్రోత్సహించాలి. దీనికోసం ఒక క్యాంపెయిన్ మోడ్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలి" అని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు ప్రజల ఆలోచనలకు అనుగుణంగా మారాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలు అందడంలో కొంత అంతరం కనిపిస్తోందని అన్నారు. ఇటీవల ఆలూరు నియోజకవర్గ పర్యటనలో ఉద్యోగుల పనితీరుపై ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను ఆయన అధికారుల వద్ద ప్రస్తావించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, దానికి తగ్గట్టుగా ఉద్యోగులు పనిచేయాలని హితవు పలికారు. రంపచోడవరం విద్యార్థిని శివాని ఆత్మహత్య ఘటనపై సీఎం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చదువులో టాపర్‌గా ఉన్న విద్యార్థిని చనిపోవడం బాధాకరమని అన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థుల మానసిక పరిస్థితిని అంచనా వేసేందుకు సైకో మెట్రిక్ టెస్టులు నిర్వహించాలన్న విద్యాశాఖ ఆదేశాలను వెంటనే అమలు చేయాలని సూచించారు. ఇందుకోసం నిపుణుల సేవలు తీసుకోవడంతో పాటు, ఉపాధ్యాయులకు కూడా అవసరమైన శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డీఎస్సీ ఆరోపణల పై జగన్‌తో బహిరంగ చర్చకు నేను సిద్ధం

డీఎస్సీ నియామకాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆ పార్టీ అధినేత జగన్‌కు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. డీఎస్సీ అంశంపై జగన్‌తో బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, దమ్ముంటే చర్చకు రావాలని ఆయన అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న లోకేశ్, జగన్ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "డీఎస్సీపై గొడ్డలి పార్టీ అధినేత చేస్తున్న ఆరోపణలపై చర్చకు నేను సిద్ధం. ఈ చర్చ కేవలం డీఎస్సీకే పరిమితం కాదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన లిక్కర్, భూ కుంభకోణాలపై కూడా చర్చిద్దాం" అని సవాల్ విసిరారు. 2 లక్షల టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత టీడీపీది అయితే, ఐదేళ్లలో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయని నీచ చరిత్ర జగన్‌ది అని లోకేశ్ ధ్వజమెత్తారు. "వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లను అమలుచేసి అత్యంత పారదర్శకంగా డిఎస్సీ నిర్వహిస్తే బురద జల్లుతున్నారు. మేము 150 రోజుల్లో అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహిస్తే, దాన్ని అడ్డుకోవాలని 150 కేసులు వేశారు. ఆ కేసులన్నీ కోర్టులు కొట్టివేయడమే మా చిత్తశుద్ధికి నిదర్శనం" అని ఆయన స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం అభివృద్ధి, సంక్షేమం అయితే.. గొడ్డలి పార్టీ విధానం విధ్వంసం, బూతులు, బాబాయ్‌ను గొడ్డలితో లేపేయడం, తల్లి, చెల్లిని ఇంటి నుంచి తరిమేయడం అని లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్‌కు 'క్రెడిట్ చోర్ డిజార్డర్' (సీసీడీ) అనే జబ్బు ఉందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి తీసుకొచ్చిన ఆర్సెలర్ మిట్టల్, గూగుల్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి పరిశ్రమలను తానే తెచ్చానని జగన్ చెప్పుకోవడం ఆయనకున్న జబ్బు లక్షణమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని లోకేశ్ తెలిపారు. ప్రభుత్వ విజయాలను, వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం స్థానాలు గెలిచేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

## హైకోర్టు సంచలన నిర్ణయం.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తొలగింపునకు ఆదేశాలు

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారశైలిపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వరుసగా కోర్టు ధిక్కరణ పిటిషన్లు నమోదవుతున్న నేపథ్యంలో ఆయన్ను కమిషనర్ పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయన స్థానంలో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని చీఫ్ సెక్రటరీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం సహించబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా లోతుకుంట పరిధిలోని సర్వే నంబర్ 1, 2లలో ఉన్న 40 ఎకరాల భూమికి సంబంధించిన వ్యవహారం విచారణకు వచ్చిన సందర్భంగా రంగనాథ్ అఫిడవిట్ దాఖలు చేశారు. ఆ భూమిలోకి హైడ్రా సిబ్బంది ప్రవేశించలేదని, ఎలాంటి కూల్చివేతలు చేపట్టలేదని అందులో పేర్కొన్నారు. వాస్తవాలను వక్రీకరించి పిటిషనర్ కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. కోర్టులు, న్యాయవ్యవస్థపై తమకు అత్యున్నత గౌరవం ఉందని పేర్కొంటూ జరిగిన పరిణామాలకు బేషరతుగా క్షమాపణలు కోరారు. అయితే రంగనాథ్ వివరణతో సంతృప్తి చెందని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. రంగనాథ్‌పై ఇప్పటికే దాదాపు 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలయ్యాయని గుర్తు చేసింది. ఒకే అధికారిపై ఇన్ని కోర్టు ధిక్కరణ కేసులు ఎందుకు నమోదవుతున్నాయని ప్రశ్నించింది. కోర్టు మధ్యంతర ఉత్తర్వులను పాటించకుండా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందా అని ప్రభుత్వ న్యాయవాదిని నిలదీసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే తీరును ఉపేక్షించలేమని స్పష్టం చేసింది. హైకోర్టు తాజా ఆదేశాలు హైడ్రా వ్యవహారంలో కీలక పరిణామంగా మారాయి. కమిషనర్ మార్పుతో పాటు ఐజీ స్థాయి అధికారిని నియమించాలని ఇచ్చిన ఆదేశాల పై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

### రాజీనామా తర్వాత పార్లమెంట్‌కు వచ్చిన ధర్మేంద్ర ప్రధాన్

దీంతో పార్లమెంట్‌లో భిన్నమైన వాతావరణం కనిపించింది. ఉదయం ప్రధాన్ పార్లమెంట్ ప్రాంగణంలోకి రాగానే.. మకార్ ద్వార్ వద్ద గుమిగూడిన బీజేపీ, ఎన్డీయే ఎంపీలు 'ధర్మేంద్ర ప్రధాన్ జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు. ఆయనను గౌరవసూచకంగా లోపలికి తీసుకెళ్లి, సంప్రదాయ టోపీని బహూకరించారు. ఈ క్లిష్ట సమయంలో తమ నేతకు సంపూర్ణ మద్దతుగా నిలుస్తున్నామని అధికార కూటమి ఈ చర్య ద్వారా స్పష్టమైన సంకేతాలు పంపింది. ఇదే సమయంలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా నేతృత్వంలో విపక్ష ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన చేపట్టారు. నీట్ ఆందోళనల సందర్భంగా జులై 20న విద్యార్థులు చేపట్టిన 'సంసద్ చలో' యాత్రపై పోలీసులు విచక్షణారహితం గా వ్యవహరించారని ఆరోపిస్తూ, 'శిక్షా చోరీ' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఈ నిరసనలో పాల్గొన్నారు. విద్యార్థులపై పెట్టిన క్రిమినల్ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు కోరారు. విద్యార్థులపై పోలీసుల చర్యల విషయంలో హోంమంత్రి స్పందించే వరకు సభా కార్యకలాపాల్లో పాల్గొనకూడదని విపక్షాలు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. నీట్ పేపర్ లీక్, విద్యావ్యవస్థలోని లోపాలపై దేశవ్యాప్తంగా విద్యార్థుల నుంచి తీవ్ర నిరసనలు వెల్లువెత్తడంతో ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ గందరగోళాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని దేశ వ్యతిరేక శక్తులు లబ్ధి పొందకుండా నిరోధించడానికే తాను తప్పుకుంటు న్నట్లు ప్రధాన్ తన రాజీనామా సందర్భంగా పేర్కొన్నారు.

## 150 ఏళ్లలో ఎన్నడూ లేని కరవు నెలకొంది: తుమ్మల నాగేశ్వరరావు

ప్రపంచంపై ప్రకృతి తీవ్రంగా దాడి చేస్తోందని తెలంగాణ వ్యవసాయం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. గత 150 సంవత్సరాలలో ఎన్నడూ చూడని తీవ్ర కరవు పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపారు. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరగడం వల్ల దేశానికి రావాల్సిన నైరుతి రుతుపవనాల జాడ లేకుండా పోయిందని, దాంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. దీని ప్రభావం వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల వరకు ఉండే అవకాశం ఉందని, రాబోయే రోజుల్లో సరైన వర్షాలు కురవవని ఐఎండీ మరియు అంతర్జాతీయ వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే నెలలో కురిసే స్వల్ప వర్షాలు కేవలం మెట్ట పంటలకు మాత్రమే ఉపయోగపడతాయని, ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగు చేయడం చాలా కష్టతరమని స్పష్టం చేశారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు తక్కువ సమయంలో, తక్కువ నీటితో పండే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా, రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలను మరింత సమర్థవంతం గా, పారదర్శకంగా తీర్చిదిద్ది రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ కమిటీల పనితీరును పరిశీలించేందుకు 6 ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామని, ఇవి వారం రోజుల పాటు తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు.

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 28 జూలై 2026

## ఎస్సీ బీసీ సంక్షేమ హాస్టళ్లలో మెనూను అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

**-ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్ల సమస్యలపై జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి కి ఎఐఎస్ఏ వినతిపత్రం**



కర్నూలు జులై 27 వార్త సాక్ష్యం

ప్రభుత్వం నిర్దేశించిన మెనూను ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో యథాతథంగా అమలు చేసి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని ఎఐఎస్ఏ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాసుగారి నాగార్జున మాట్లాడుతూ, కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలు కావడం లేదని అన్నారు. విద్యార్థులకు గుడ్లు, చికెన్ వంటి పోషకాహారం పూర్తిస్థాయిలో అందడం లేదని, నాసిరకం ఆహారం అందిస్తున్నారని, తాగునీటి సమస్యలు, అపరిశుభ్రమైన మరుగుదొడ్లు, శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనాలు విద్యార్థుల ఆరోగ్యాన్ని, విద్యాభ్యాసాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని..ప్రభుత్వం ప్రతి సంవత్సరం సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ కోసం కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నప్పటికీ, విద్యార్థులకు కనీస ప్రమాణాలతో కూడిన ఆహారం, వసతి, పారిశుద్ధ్య సౌకర్యాలు అందడం లేదన్నారు..అందువల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయించాలని, నిర్లక్ష్యం వహిస్తున్న హాస్టల్ వార్డెన్లు, సంబంధిత అధికారులపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వసతి, స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, భద్రత, వైద్య సదుపాయాలు, అవసరమైన అన్ని మౌలిక వసతులను వెంటనే కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఏ నాయకులు పవన్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి నిరసనకు వైసీపీ పిలుపు



గుంటూరు జులై 27 వార్త సాక్ష్యం

డీఎస్సీ స్కాంపై సీబీఐ విచారణ జరిపించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను వెంటనే చెల్లించాలని, ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం (జూలై 28) జిల్లా స్థాయిలో నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువత నిరసన ర్యాలీ పోస్టర్‌ను సోమవారం ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ ఆవిష్కరించారు.గుంటూరు రూరల్ మండలం ఏటుకూరు బైపాస్ రోడ్డులోని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లేశ్వరునికి భక్తుల కానుకలు



రెంటచింతల జులై 27 వార్త సాక్ష్యం

కృష్ణానది తీరంలోని సత్రశాల శ్రీ గంగా భ్రమరాంబా సమేత మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సత్తెనపల్లి దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి. లీలావతి పర్యవేక్షించారు. ఐదు నెలల కాలానికి సంబంధించి మల్లేశ్వరస్వామి ఆలయ హుండీలో రూ.70,660 ఆదాయం లభించింది. గత హుండీ లెక్కింపులో రూ.57,330 రావడంతో పోలిస్తే ఈసారి ఆదాయం పెరిగింది. అలాగే రెంటచింతల శివాలయం హుండీ ద్వారా రూ.11,984 ఆదాయం లభించగా, గతంలో రూ.8,691 వచ్చినట్లు అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ జీవి శివయ్య, ఈఓ గాదె రామిరెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు కె. బ్రహ్మాచారి, పద్మ, డి. బ్రహ్మయ్య, గోపిచారి, శర్మ, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాలలో కొత్త ఈ ఎస్ ఐ సి బ్రాంచ్ కార్యాలయం ఏర్పాటు కు అనుమతి

**-భారత ప్రభుత్వం కు ధన్యవాదములు**

**-నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**

నంద్యాల జులై 27 వార్త సాక్ష్యం




నంద్యాల జిల్లా కేంద్రం లో, జూన్ 2026లో కొత్త ఈఎస్ఐసి బ్రాంచ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినందుకు భారత ప్రభుత్వం కు ధన్యవాదములు తెలుపుతున్నామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. సోమవారం లోక్ సభలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి జీ రో అవర్ లో మాట్లాడుతూ ఇది స్వాగతించదగిన చర్య అని, దీనివల్ల నంద్యాల జిల్లాలోని కార్మికులకు ఈఎస్ఐ సేవలు, ప్రయోజనాలు మరింత అందుబాటులోకి వస్తాయన్నారు. అయితే ఇప్పటివరకు బ్రాంచ్ కార్యాలయానికి ఎటువంటి రెగ్యులర్ సిబ్బందిని నియమించలేదని, కార్యాలయం పూర్తి సామర్థ్యంతో పనిచేయడానికి వీలుగా, మంజూరైన సిబ్బందిని ఎప్పటిలోగా నియమిస్తారో వివరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ తరువాత, నంద్యాలతో సహా కొత్తగా ఏర్పడిన అనేక జిల్లాలలో ఇప్పటికీ ప్రత్యేక ఈపీఎఫ్ఓ జిల్లా కార్యాలయాలు లేవని, దీనివల్ల ప్రావిడెంట్ ఫండ్ సంబంధిత సేవల కోసం కార్యకర్తలు కర్నూలు వంటి పాత జిల్లాలకు ప్రయాణించవలసి వస్తోందని. నంద్యాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర కొత్తగా ఏర్పడిన జిల్లాలలో ప్రత్యేక ఈపీఎఫ్ఓ జిల్లా కార్యాలయాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం వద్ద ఏమైనా ప్రతిపాదన ఉందా, ఒకవేళ ఉంటే ఎప్పటిలోగా అమలు చేస్తారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లోక్ సభలో కోరారు. ఈఎస్ఐసి వారి సొంత నిబంధనల ప్రకారం, వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌లను 21 నుండి 30 రోజుల కాలపరిమితిలోగా పరిష్కరించాలని అయితే, నా నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గం నుండి అందిన వివిధ స్థానిక నివేదికల ప్రకారం, ఆచరణలో బీమాదారులకు వారి రీయింబర్స్‌మెంట్ అందడానికి 6 నుండి 8 నెలల సమయం పడుతోందని. దీనివల్ల తీవ్రమైన ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. నెలకు కేవలం 21,000 రూపాయలు లేదా అంతకంటే తక్కువ సంపాదించే ఒక బీమాదారుడు అత్యవసర వైద్య చికిత్స కోసం తరచుగా 2 నుండి 5 లక్షల రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది, రీయింబర్స్‌మెంట్ లేకుండా నెలల తరబడి అటువంటి ఖర్చులను భరించగలరని వారి నుండి ఆశించలేమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని టీడీపీ నేతృత్వం లోని ఎన్డీఏ ప్రభుత్వం రాయలసీమలో సుమారు 275 ప్రాజెక్టుల కింద దాదాపు 4.58 లక్షల కోట్ల రూపాయల ప్రతిపాదిత పెట్టుబడులను ఆకర్షిం చిందని. పునరుత్పాదక ఇంధనం, తయారీ, ఎలక్ట్రాని క్స్, లాజిస్టిక్స్, వస్త్ర పరిశ్రమ వంటి రంగాలలో వీటి ద్వారా సుమారు 3.57 లక్షల ఉద్యోగాలు సృష్టించబడతాయని అంచనా. చారిత్రాత్మకంగా పారిశ్రామికీకరణలో వెనుకబడిన ఈ ప్రాంతానికి ఇది ఒక పరివర్తనాత్మక అవకాశమని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఈ ప్రాజెక్టులు అమలు జరుగుతున్న క్రమంలో, చట్టపరమైన నిబంధనలు ఉన్నప్పటికీ, చాలా మంది కాంట్రాక్ట్, వలస కార్మికులు ESI, జ్యూఖీ వంటి చట్టబద్ధమైన ప్రయోజనాలను పొందడంలో జాప్యాన్ని ఎదుర్కొంటున్నారని ఇటీవలి కార్మిక వివాదాలు వెలుగులోకి తెచ్చాయనిప్రధాన పారిశ్రామిక ప్రాజెక్టుల కోసం కాంట్రాక్టర్లు ధృవీకరించబడిన EPFO , ESIC నిబంధనలను పాటిస్తున్నారని ఆవర్తన ఆడిట్‌లు, సమ్మతి తనిఖీల ద్వారా తప్పనిసరి చేసి, అమలును బలోపేతం చేయడాన్ని కేంద్ర కార్మిక శాఖ మంత్రి గారు పరిశీలిస్తారా అన్నారు. కార్మికులు ఉద్యోగంలో చేరిన మొదటి నుంచే వారి చట్టబద్ధమైన సామాజిక భద్రతను పొందుతారని పార్లమెంట్ దృష్టికి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెచ్చారు.

# నేడు కౌతాళంలో తి. తి. దే. ధార్మిక కార్యక్రమాలు



కర్నూలు జులై 27 వార్త సాక్ష్యం

తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన నేడు కౌతాళంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నందు మంగళవారం నుండి శనివారం వరకు ప్రతిరోజు సాయంత్రం 6-00 గంటల నుండి ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మూడురోజుల పాటు స్వాత్మానందస్వామిచే ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం ఉదయం 10-00 గంటలకు



సామూహిక గోపూజ మరియు కుంకుమార్చన, శనివారం రామాలయం నందు భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను కౌతాళంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతరావు, జి. సోమశేఖర రెడ్డి, జి. శేషారెడ్డి స్థానిక భక్తమండలితో కలిసి కరపత్రాలను బ్యానర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హనుమం



తప్ప, అయ్యప్ప, ఒడ్డె రాముడు, టి. లింగారెడ్డి, ఓంకారరెడ్డి, నర్సిరెడ్డి, రాఘవ, శ్రీనివాసుల రెడ్డి, టి. నారాయణ రెడ్డి, శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మహానంది రోడ్డులోని 30 ఎం.ఎల్.డి తాగునీటి శుద్ధీకరణ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ







**-రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ , జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా**

**-పట్టణ ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం**

**-ప్లాంట్ నిర్వహణ, శుద్ధీకరణ ప్రక్రియలను నిశితంగా పరిశీలించిన మంత్రి, కలెక్టర్**

నంద్యాల జులై 27 వార్త సాక్ష్యం

పట్టణ ప్రజల ఆరోగ్య భద్రత, నాణ్యమైన తాగునీటి సరఫరాపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని . ఇందులో భాగంగా సోమవారం నంద్యాల మహానంది రోడ్డులో గల అమృత్ పథకం కింద నిర్మించిన 30 ఎం.ఎల్.డి తాగునీటి శుద్ధీకరణ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖామాత్యులు ఎన్ఎండి ఫరూక్ , నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలో భాగంగా మంత్రి మరియు కలెక్టర్ ప్లాంట్‌లోని ప్రతి విభాగాన్ని నిశితంగా పరిశీలించారు. నీటి శుద్ధీకరణ (ఫిల్ట్రేషన్) ప్రక్రియ జరుగుతున్న తీరును, క్లోరినేషన్ విధానాన్ని మరియు ప్లాంట్ నిర్వహణ రిజిస్టర్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీరు పూర్తిగా స్వచ్ఛంగా, సురక్షితంగా ఉండేలా ప్రతిరోజూ ల్యాబ్ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. శుద్ధీకరణ కేంద్రం ప్రాంగణంతో పాటు నీటి నిల్వ ట్యాంకులను నిరంతరం శుభ్రంగా ఉంచాలని, ఎక్కడా కాలుష్యానికి తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజల నుండి వచ్చే నీటి సమస్యల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని, తాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని హెచ్చరించారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎమ్మార్వో శ్రీనివాసులు, గుర్రప్ప, ప్రజారోగ్య, పురపాలక సాంకేతిక శాఖ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# టెలికామ్ వినియోగదారులకు మెరుగైన సేవలే ట్రాయ్ లక్ష్యం

**-డాక్టర్ బత్తుల సంజీవరాయుడు ట్రాయ్ కాగ్ సభ్యులు**

నంద్యాల జులై 27 వార్త సాక్ష్యం

టెలికామ్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ట్రాయ్ లక్ష్యమని ట్రాయ్ కాగ్ సభ్యులు డాక్టర్ బత్తుల సంజీవరాయుడు తెలిపారు. సోమవారం డోన్ పట్టణంలోని, ఐటిఐ కళాశాలలో టెలికం వినియోగదారుల అవగాహన సదస్సు పిఎస్ఎస్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా ట్రాయ్ కాగ్ మెంబర్-డాక్టర్ బత్తుల సంజీవరాయుడు మాట్లాడుతూ టెలికామ్ నియంత్రణ ప్రాధికార సంస్థ ట్రాయ్ ప్రధాన బాధ్యతల్లో సెల్ వినియోగదారుల ప్రయోజనాలను సంరక్షించడం ఒకటి అన్నారు. మెరుగైన టెలికామ్ సేవలు అందించడం కోసం సెల్ కంపెనీలు అయిన జియో, ఎయిర్టెల్, బిఎస్ఎన్ఎల్, వోడాఫోన్ మొదలగు కంపెనీల సేవలపై నిబంధనలు, ఆదేశాలు, పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉత్తర్వులను జారీ చేస్తుందని పేర్కొన్నారు. టెలికామ్ రంగంలో అమలు చేసిన ఆర్థిక సంస్కరణల ద్వారా 110 కోట్ల మంది వినియోగదారులు మనదేశంలో మెరుగైన సేవలు ట్రాయ్ ద్వారా పొందుతున్నారన్నారు. వివిధ టెలికామ్ సేవలు మరియు కేబుల్ టీవీ సేవలు నాణ్యతా ప్రమాణాలను సమర్ధవంతంగా రూపొందించి వాటిని పటిష్టంగా అమలు చేయటానికి కేంద్ర ప్రభుత్వం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రాయ్ అనే స్వతంత్ర నియంత్రణ సంస్థను రూపకల్పన చేసి అమలులోకి తెచ్చిందని చెప్పారు. అంతేకాక ట్రాయ్ నిబంధనల ప్రకారము, టారిఫ్ సిస్టం, వ్యాపార ప్రకటనల నిశిద్ధం, సేవల నాణ్యత ప్రమాణాలు, మొబైల్ నంబర్ పోర్టబుల్టి, సౌకర్యం విలువతో కూడిన సేవలు, రక్షణ, వినియోగదారుల హక్కులు మరియు మొబైల్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ట్రాయ్ ఆవిర్భావ ఆశయం అన్నారు. ప్రస్తుత తారీఫ్ ఇతర కంపెనీల కంటే తక్కువగా బిఎస్ఎన్ఎల్ ఉండడమే కాక, బిఎస్ఎన్ఎల్ లో కూడా 4జీ సేవలు రావడం ద్వారా వినియోగదారులు బిఎస్ఎన్ఎల్ వైపు చూస్తున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డి, డిటిఓ- పురంధర ప్రసాద్, టిఓ.నాగేంద్ర ప్రసాద్, ఎటిఓ. శ్రీధర్, ఎటిఓ.జగన్, ఏఇ. నాగరాజు, వడ్డే.నాగరాజ విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# కర్నూలు జిల్లాలో ప్రవేటు స్కూల్ లపై చర్యలు తీసుకోండి

**-ఫిర్యాదు చేసిన విద్యార్థి సంఘాల నాయకులు**

**-విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ప్రవేట్ విద్యాసంస్థలు**

కర్నూలు జులై 27 వార్త సాక్ష్యం





కర్నూలు జిల్లా లోని ఎమ్మిగనూరు పట్టణంలో నడుస్తున్న మేధా ప్రాక్సిస్ స్కూల్ మరియు లలిత అలియాజ్ ప్రతిభ విద్యానికేతన్ యూపీ స్కూల్లకు సంబంధించి పర్మిషన్ గడువు ముగిసినా, రెన్యువల్ లేకుండా విద్యాసంస్థలను కొనసాగిస్తున్నారని వాటిపైన ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వేటూరి రంగస్వామి సోమవారం జిల్లాలో ఏర్పాటు చేసిన పిజిఆర్ఎస్ లో జిల్లా కలెక్టర్ కు డీఈవో కు వినతిపత్రం అందజేశారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ పట్టణంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రజలలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యాశాఖ నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాల చెల్లుబాటు అయ్యే గుర్తింపు (Recognition) మరియు రెన్యువల్ పత్రాలు కలిగి ఉండాలి. అయితే ఈ స్కూల్స్‌పై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలు ఉన్నప్పటికీ ఎమ్మిగనూరు ఎంఈఓ1 ఆంజనేయులు, ఇప్పటి వరకు సరైన తనిఖీలు నిర్వహించకపోవడం, నోటీసులు ఇవ్వకపోవడం, చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల భవిష్యత్తు, వారి సర్టిఫికెట్ల చెల్లుబాటు, మరియు విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. పర్మిషన్ మరియు రెన్యువల్ లేకుండా స్కూల్స్ నడపడం విద్యాశాఖ చట్టాలకు విరుద్ధమైతే, సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై కూడా విచారణ జరపడం అవసరం. అందువల్ల జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే ప్రత్యేక తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేసి, సంబంధిత స్కూల్స్‌కు సంబంధించిన పర్మిషన్, రెన్యువల్, మౌలిక వసతులు, విద్యార్థుల నమోదు వివరాలను పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. అలాగే ఎమ్మిగనూరు ఎంఈఓ 1 ఆంజనేయులు గఈ వ్యవహారంలో ఎందుకు చర్యలు తీసుకోలేదనే అంశంపై కూడా విచారణ జరిపి, బాధ్యులపై తగిన పరిపాలనా చర్యలు తీసుకోవాలని వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నాము. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించవలసిందిగా కోరుతున్నాము ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పగతో ప్రాణం తీశారు

**-పాత కక్షలతో యువకుడిని హత్య.. ముగ్గురు అరెస్ట్.. డీఎస్పీ మోయిన్**

చీరాల జులై 27 వార్త సాక్ష్యం




బాపట్ల జిల్లా చిన్నగంజాం పోలీస్ స్టేషన్ పరిధిలోని సంతరావూరు గ్రామంలో ఇటీవల జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. పాత కక్షలే హత్యకు కారణమని గుర్తించిన పోలీసులు సోమవారం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఒక మోటార్ సైకిల్, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. చీరాల డీఎస్పీ ఎం.డి. మొయిన్ చిన్నగంజాం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సంతరావూరుకు చెందిన ఆతిన శ్రీను అలియాస్ శ్రీనివాసరావు (53) కుటుంబ కలహాల కారణంగా గత ఏడాదిగా భార్యకు దూరంగా ఉంటూ గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన కుటుంబ విభేదాలకు ఎదురింటి నివాసి ఉప్పాల వెంకట నారాయణ కుటుంబమే కారణమని భావించి తరచూ వారిని దూషించేవాడు.దీంతో మనస్తాపానికి గురైన ఉప్పాల వెంకట నారాయణ తన స్నేహితులు కొత్తగొర్ల సుబ్రహ్మణ్యం, చేకూరి బలరాంతో కలిసి హత్యకు పథకం రచించాడు. ఈ నెల 23వ తేదీ రాత్రిసంతరావూరు--కేశవరపాడు రోడ్డులోని గొర్రెల దొడ్డి వద్ద నిద్రిస్తున్న శ్రీనివాసరావుపై కర్రలతో దాడి చేసి, తీవ్రంగా కొట్టి హత్య చేసి పరార య్యారు.మృతుడి తమ్ముడు ఆతిన రమేష్ అలియాస్ సురేష్ ఫిర్యాదు మేరకు చిన్నగంజాం పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు ఇంకొల్లు సీఐ ఎం. రామానాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు చేపట్టి, భౌతిక ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా నిందితులను గుర్తించారు. సోమవారం ఉదయం సంతరావూరు గ్రామ సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరుస్తున్నట్లు వెల్లడించారు.

# దస్తావేజు లేఖరుల నిరసన

బాపట్ల జులై 27 వార్త సాక్ష్యం

జీవో నంబర్ 396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బాపట్ల దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక పెన్‌డౌన్ ఆందోళన సోమవారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. బాపట్ల రిజిస్ట్రార్ కార్యాలయం (ఆర్ఓ) ఎదుట నిర్వహించిన ఈ నిరసనలో డాక్యుమెంట్ రైటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంఘం జాయింట్ సెక్రటరీ సంతోష్ మాట్లాడుతూ, జీవో 396 అమలుతో దస్తావేజు లేఖరుల ఉపాధి తీవ్రంగా దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఆ జీవోను రద్దు చేసి, దస్తావేజు లేఖరుల జీవనోపాధికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునే వరకు తమ నిరవధిక పెన్‌డౌన్ ఆందోళన కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బాపట్లకు చెందిన దస్తావేజు లేఖరులు పాల్గొన్నారు.



# ప్రజా వినతుల స్వీకరణ




రేపల్లె జులై 27 వార్త సాక్ష్యం

రేపల్లెలోని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం ఆర్డీఓ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి మొత్తం నాలుగు అర్జీలు స్వీకరించారు.రేపల్లె మండలం బేతపూడి గ్రామానికి చెందిన చింతగుండ్ల హెప్సిబా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ నుంచి అత్తగారి కుటుంబాన్ని వేరు చేసి 'తల్లికి వందనం' పథకం మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు.నగరం మండలం అద్దంకివారిపాలెం గ్రామానికి చెందిన రాయనశ్చయ తమ వీధిలో సిమెంట్ రోడ్డు, ఇరువైపులా డ్రైన్లు, సైడ్‌వాల్స్ నిర్మించాలని కోరుతూ అర్జీ అందజేశారు. రేపల్లె మండలం కామరాజుగడ్డ గ్రామానికి చెందిన పెమ్మాడి వెంకటేశ్వరరావు నకిలీ వీలునామా ఆధారంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందారని ఆరోపిస్తూ, ఆ అంశాన్ని ఆర్ఓఆర్‌లో పరిష్కరించాలని కోరారు.చెరుకుపల్లి మండలం పొన్నపల్లి గ్రామానికి చెందిన కుంచల నరసమ్మ తమ భూములకు సంబంధించిన సమస్యను ఆర్ఓఆర్ ద్వారా పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. ప్రజల నుంచి అందిన నాలుగు అర్జీలను సంబంధిత శాఖల ద్వారా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# కలాంకు మాజీ సైనికుల నివాళి

**-కలాం ఆశయాలు సమాజానికి స్ఫూర్తిదాయకం... తాండ్ర సాంబశివరావు**



బాపట్ల జులై 27 వార్త సాక్ష్యం

భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా ఖ్యాతి గాంచిన డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా సోమవారం బాపట్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని త్రవ్వకాలువపై ఉన్న ఆయన విగ్రహానికి మాజీ సైనికులు ఘనంగా నివాళులర్పించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డాక్టర్ అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, యువతకు ఆయన జీవితం, ఆశయాలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. దేశాభివృద్ధి, శాస్త్ర సాంకేతిక రంగాల పురోగతికి కలాం చూపిన మార్గంలో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం విగ్రహ కమిటీ చైర్మన్ పఠాన్ రాజేష్, బాపట్ల అసోసియేషన్ గౌరవ సభ్యుడు అబ్దుల్ రజాక్, మాజీ సైనికులు తోట దుర్గారావు, రాయపూడి శ్రీనివాసరావు, దూళ్ల వెంకటేశ్వర్లు, మర్రి వీరస్వామి, రహీమ్ తదితరులు పాల్గొని కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు.

# గంజాయి దందాపై మెరుపు దాడులు

బాపట్ల జులై 27 వార్త సాక్ష్యం



వెదుళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాలు, వినియోగంపై చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 190 గ్రాముల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, టీవీఎస్ జూపిటర్ ద్విచక్ర వాహనం, రూ.600 నగదును స్వాధీనం చేసుకున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు వడ్డెరపాలెం సమీపంలోని హిందూ శ్మశానవాటిక వద్ద గంజాయి సేవిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా, వెదుళ్లపల్లికి చెందిన దేవి ఏడుకొండల రెడ్డి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. దీంతో గంజాయి విక్రయిస్తున్న ఏడుకొండల రెడ్డిని అరెస్టు చేసి, అతని వద్ద ఉన్న గంజాయి ప్యాకెట్లు, నగదు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.నలుగురు నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బాపట్ల రూరల్ సీఐ బి. హరికృష్ణ తెలిపారు. పట్టుబడిన వారిలో ముగ్గురు ఇప్పటికే పలు క్రిమినల్ కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ కేసులో మరికొందరి పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

వార్త సాక్ష్యం
మంగళవారం 28 జూలై 2026

## శాంతిభద్రతలే ప్రధాన లక్ష్యం

-డీఎస్పీ హనుమంతరావు



చిలకలూరిపేట జులై 27 వార్త సాక్ష్యం

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అసాంఘిక శక్తుల కట్టడి, నేరాల నియంత్రణే లక్ష్యంగా పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం చందవరం గ్రామంలో పోలీసులు సోమవారం విస్తృత స్థాయిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ముందస్తు చర్యల్లో భాగంగానే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, నేరాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు.తనిఖీల్లో అనుమతులు, సరైన పత్రాలు లేని 26 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.కార్డన్ సెర్చ్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాసేవల్లో బాధ్యత పెంచాలి

-ఎస్పీ ఉమామహేశ్వర్



బాపట్ల జులై 27 వార్త సాక్ష్యం

ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రతి ఫిర్యాదును చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)' కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను ఎస్పీ స్వయంగా స్వీకరించి, బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.పీజీఆర్ఎస్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదుపై చట్టపరిధిలో సమగ్ర విచారణ చేపట్టి, నిర్ణీత కాలపరిమితిలో పరిష్కారం చూపాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలకు న్యాయం జరిగేలా పారదర్శకంగా, జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా పారిశ్రామికవేత్తలే రాష్ట్రాభివృద్ధి బాట





బాపట్ల జులై 27 వార్త సాక్ష్యం

"ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త" అనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పాన్ని మహిళలు సాకారం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. అరకు కాఫీ విక్రయాల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డులు సాధించిన చీరాలకు చెందిన అర్జీ శాంతి, మార్టూరుకు చెందిన షేక్ షాజియాభానును సోమవారం కలెక్టరేట్‌లో ఘనంగా సత్కరించి నగదు బహుమతులు అందజేశారు.కేవలం పది నెలల్లోనే అత్యుత్తమ విక్రయాలు నమోదు చేసి రాష్ట్రంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించడం బాపట్ల జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధితో ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు.ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త తయారవ్వాలన్న ముఖ్యమంత్రి సంకల్పం నెరవేరాలంటే మహిళలు ముందుకు రావాలని, డ్వాక్రా సంఘాల్లోని సభ్యులు వ్యాపార రంగాల్లో అడుగుపెట్టి విజయాలను అందుకోవాలని పిలుపునిచ్చారు. ఇతర మహిళలకు ఆదర్శంగా నిలిచిన అవార్డు గ్రహీతల విజయగాథలను స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ భావన వశిష్ఠ, డీఆర్ఓ జి. గంగాధర్ గౌడ్, డీఆర్డీఏ పీడీ బి. సింగయ్య, వెలుగు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల ధర్నాకు సన్నాహాలు

చీరాల జులై 27 వార్త సాక్ష్యం

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 31న బాపట్ల కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ బాపట్ల జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ, గత ఏడు సంవత్సరాలుగా ఆశా వర్కర్ల వేతనాలు పెంచేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మార్చి 5న నిర్వహించిన 'చలో విజయవాడ' సందర్భంగా ఆశా ప్రతినిధులతో చర్చలు జరిపి 11 డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం అంగీకరించినప్పటికీ, ఐదు నెలలు గడిచినా వాటికి సంబంధించి జీవోలు జారీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.పెరుగుతున్న ధరలతో ఆశా వర్కర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కుటుంబ పోషణతో పాటు పిల్లల విద్యాభారం మోయడం కష్టంగా మారిందన్నారు. అధిక పనిభారం కారణంగా అనేక మంది ఆశా వర్కర్లు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పనిఒత్తిడి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆశా వర్కర్లకు బీఎల్ఓ విధులు అప్పగించడం సమంజసం కాదన్నారు.ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే జీవో రూపంలో అమలు చేయాలని, లేనిపక్షంలో ఈ నెల 31న బాపట్ల కలెక్టరేట్‌ను ముట్టడించే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. జిల్లాలోని ఆశా వర్కర్లు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని



పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో చీరాల పట్టణ నాయకుడు వసంతరావు, ఆశా నాయకులు శ్యామల, షాహిదా, ఝాన్సీ లక్ష్మి, ధనలక్ష్మి, భవాని, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా సేవలో ప్రతిభకు పట్టం

-పీజీఆర్ఎస్‌లో శ్యామ్ సుందర్‌కు జిల్లా అత్యుత్తమ అధికారి గుర్తింపు

-ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ప్రతిభకు కలెక్టర్ ప్రశంస

-పారదర్శక సేవలందించిన విద్యుత్ శాఖ డీఈకి ఘన సన్మానం

-ప్రజల పట్ల బాధ్యతే అధికారుల విజయానికి కొలమానం: కలెక్టర్

బాపట్ల జులై 27 వార్త సాక్ష్యం

ప్రజల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి, పారదర్శకత, వేగవంతమైన స్పందన కనబరిచిన రేపల్లె విద్యుత్ శాఖ డీఈ శ్యామ్ సుందర్‌కు పీజీఆర్ఎస్‌లో ఈ వారం జిల్లాస్థాయి 'బెస్ట్ ఆఫీసర్' గుర్తింపు లభించింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఘనంగా సత్కరించారు. ప్రజల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించడం, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, సమస్యలపై క్షేత్రస్థాయిలో స్పందించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం వంటి అంశాల్లో ప్రతిభ కనబరిచిన రేపల్లె రెవెన్యూ డివిజన్ విద్యుత్ శాఖ డీఈ శ్యామ్ సుందర్ ఈ వారం జిల్లాలో అత్యుత్తమ అధికారిగా నిలిచారు.అర్జీదారులకు సరైన సమాచారం అందించడం, పారదర్శక విధానాలను పాటించడం, బాధ్యతాయుతంగా విధులు నిర్వహిం చడం వంటి ప్రమాణాల ఆధారంగా ఆయనను ఎంపిక చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఐఏఎస్, శాలువా





కప్పి జ్ఞాపిక అందజేసి అభినందిం చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను సానుకూల దృక్పథంతో స్వీకరించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించే అధికారులు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తారని పేర్కొన్నారు. ప్రతి అధికారి ప్రజా సేవనే ప్రధాన ధ్యేయంగా భావించి బాధ్యతతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, డీఆర్ఓ జి. గంగాధర్ గౌడ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న, విద్యుత్ శాఖ ఎస్ఈ ఆంజనేయులు, గ్రామ--వార్డు సచివాలయాల కోఆర్డినేటర్ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే అధికారుల లక్ష్యం



బాపట్ల జులై 27 వార్త సాక్ష్యం

ప్రజల నుంచి అందుతున్న ప్రతి అర్జీని గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పరిష్కరించి అర్జీదారులకు పూర్తి సంతృప్తి కలిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి 182 అర్జీలను స్వీకరించారు. నడవలేని దివ్యాంగుల వద్దకు కలెక్టర్ స్వయంగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని అర్జీలు స్వీకరించడం విశేషం.కొన్ని అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్నింటిపై సంబంధిత శాఖల అధికారులు సమగ్రంగా విచారించి నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు పునరావృతం కాకుండా చిత్తశుద్ధితో పనిచేసి, ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే అధికారుల ప్రధాన బాధ్యత కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ భావన వశిష్ఠ, డీఆర్ఓ జి. గంగాధర్ గౌడ్, కేఆర్ఆర్సీ ఉప కలెక్టర్ లవన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నగరంలో ప్లాస్టిక్ పై ప్రత్యేక నిఘా

గుంటూరు జులై 27 వార్త సాక్ష్యం



గుంటూరు నగరంలో ఆగస్టు 15 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయనున్నట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ప్రకటించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నియం త్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీతో పాటు తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై భారీ జరిమానాలు, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్లాస్టిక్ తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. నగరంలోని తయారీ యూనిట్లు, గోదాములు, హోల్‌సేల్ మార్కెట్లు, రిటైల్ దుకాణాలు, వీధి వ్యాపారుల వద్ద ప్రత్యేక బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.తనిఖీల్లో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు గుర్తిస్తే వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు 'స్వచ్ఛ గుంటూరు' యాప్, నగరపాలక సంస్థ నిబంధనల మేరకు అక్కడికక్కడే జరిమానాలు విధిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. నిబంధనలను పదేపదే ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలు, వ్యాపార వాణిజ్య సంస్థల్లో అవగాహన పెంచేందుకు అన్ని వార్డుల్లో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా, యువజన సంఘాలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాల వినియోగం, చెత్తను తడి--పొడి చెత్తగా వేరు చేసే విధానంపై అవగాహన కల్పించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

# గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

భట్టిప్రోలు జులై 27 వార్త సాక్ష్యం

ప్రజల సంక్షేమంతో పాటు గ్రామాల సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు అన్నారు. భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన జీఎస్‌బీ రోడ్డు, రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఐలవరంలో రూ.5.08 కోట్లతో 46 అభివృద్ధి పనులు మంజూరుకాగా, వాటిలో 38 పూర్తయ్యాయని తెలిపారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులతో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. 'స్వర్ణాంధ్ర--విజన్ 2047' లక్ష్యంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని, నియోజకవర్గానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు



పాల్గొన్నారు.

# బీజేపీ జెండా దిమ్మె తొలగింపుపై రాస్తారోకో



రెంటచింతల జులై 27 వార్త సాక్ష్యం

రెంటచింతల మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ రహదారిపై బీజేపీ జెండా దిమ్మెను తొలగించడాన్ని నిరసిస్తూ సోమవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా భారతమాతకు జై అంటూ నినాదాలు చేస్తూ సుమారు గంటపాటు ట్రాఫిక్‌ను నిలిపివేశారు. ఘటనాస్థలిలో బీజేపీ, టీడీపీ నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోగా, పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను శాంతింపజేశారు.పోలీసు స్టేషన్ రోడ్డులోని టీడీపీ ఆర్చ్ సమీపంలో గతంలో ఏర్పాటు చేసిన బీజేపీ జెండా దిమ్మెను బైపాస్ రహదారి విస్తరణ, విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనుల్లో భాగంగా కాంట్రాక్టర్లు ప్రొక్లెయినర్‌తో తొలగించారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా జెండా దిమ్మెను తొలగించడం అన్యాయమని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఏలూరి శశికుమార్, మండల అధ్యక్షుడు ఈ. రాజశేఖర్‌రెడ్డి తదితరులు అక్కడికి చేరుకుని నిరసన చేపట్టారు. అయితే రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అడ్డుగా ఉన్న నిర్మాణాలను మాత్రమే తొలగించారని, దీనికి టీడీపీకి ఎలాంటి సంబంధం లేదని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరగడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది.కారంపూడి సీఐ పి. శరత్‌బాబు, ఎస్ఐ సీహెచ్. నాగార్జున ఆధ్వర్యంలో పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి డీఎస్పీ ఎం. మహేశ్వరరావుతో పాటు టీడీపీ నాయకులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం తొలగించిన ప్రదేశానికి సమీపంలోనే బీజేపీ కార్యకర్తలు మళ్లీ కమలం జెండాను ఏర్పాటు చేయడంతో వివాదం సద్దుమణిగింది. ఈ సందర్భంగా గురజాల డీఎస్పీ ఎం. మహేశ్వరరావు మాట్లాడుతూ, రహదారి విస్తరణ పనుల్లో అక్రమణలు తొలగించడం సాధారణ ప్రక్రియేనని, ఇలాంటి అంశాలను రాజకీయ వివాదాలుగా మార్చకుండా అన్ని వర్గాలు సంయమనం పాటించాలని సూచించారు.

# ప్రజల్లోకి కూటమి-ఇంటింటికీ ఎమ్మెల్యే





-చంద్రబాబు ఆదేశాలతో ప్రచారం
-ప్రజా వినతులపై ప్రత్యేక దృష్టి
-సంక్షేమమే ప్రభుత్వ బలం

బాపట్ల జులై 27 వార్త సాక్ష్యం

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు గ్రామస్థాయి నుంచి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ సేవలపై భరోసా కల్పించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బాపట్ల నియోజకవర్గంలో "రెండేళ్ల నమ్మకం -- సంక్షేమం -- అభివృద్ధి" కార్యక్రమానికి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు శ్రీకారం చుట్టారు. బాపట్ల మండలం చుండూరుపల్లి గ్రామంలో సోమవారం ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ విజయాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.అదే సమయంలో గ్రామస్తుల సమస్యలు, వినతులను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజలకు మరింత చేరువ కావడం, ప్రభుత్వ సేవలను ప్రతి కుటుంబానికి చేరవేయడం, స్థానిక స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు, నియోజకవర్గ పరిశీలకుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సొంతది పక్కన- అద్దెదే ముద్దా

-మున్సిపాలిటీ యంత్రం రిపేర్ పేరుతో పక్కన..
-అద్దె యంత్రంతో లక్షల బిల్లుల చెల్లింపులపై అనుమానాలు
-ఎమ్మెల్యే తీరు ఒకరకం... అధికారులు తీరు మరో రకం....

బాపట్ల జులై 27 వార్త సాక్ష్యం

బాపట్ల మున్సిపాలిటీలో నిధుల కొరత ఉందని చెబుతూనే మరోవైపు అధికారుల తీరు మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సొంతంగా ఉన్న ప్రొక్లైనర్‌ను రిపేర్ చేయకుండా నెలల తరబడి విజయవాడలో ఉంచి, అద్దె ప్రొక్లైనర్‌తో పనులు నిర్వహిస్తూ భారీ బిల్లులు పెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే నిధులను ఆదా చేయాలని సూచిస్తుంటే, అధికారులు మాత్రం ఖర్చులను పెంచే విధంగా వ్యవహరిస్తున్నారనే చర్చ మున్సిపల్ శాఖతో పాటు పట్టణంలోనూ సాగుతోంది. బాపట్ల మున్సిపాలిటీలో అధికారుల పని తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మున్సిపాలిటీకి మురుగు కాలువల శుభ్రపరిచే పనులు, చెట్ల తొలగింపు, పైపులైన్ మరమ్మతులు వంటి పనుల కోసం ఇటీవలే కొత్త ప్రొక్లైనర్‌ను కొనుగోలు చేశారు. నిధులు లేవన్న పరిస్థితుల్లో భవిష్యత్‌లో అద్దె భారం తగ్గించాలనే ఉద్దేశంతో ప్రజాప్రతినిధుల చొరవతో ఈ యంత్రాన్ని సమకూర్చినట్లు చెబుతున్నారు.అయితే ఆ యంత్రానికి రెండు నెలల క్రితం స్వల్ప మరమ్మతులు అవసరమయ్యాయని, దానిని విజయవాడకు పంపించిన తర్వాత ఇప్పటివరకు తిరిగి తీసుకురాలేదని సమాచారం. ఈలోగా మున్సిపాలిటీలో జరిగే దాదాపు అన్ని తవ్వకాల పనులకు అద్దె ప్రొక్లైనర్‌ను వినియోగిస్తున్నారు. ముఖ్యంగా మున్సిపల్ కార్యాలయం ఎదురుగా గడియాస్తంభం వద్ద పైపులైన్ మరమ్మతుల కోసం జరుగుతున్న తవ్వకాలు కూడా అద్దె యంత్రంతోనే నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ పనులన్నీ సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలోనే జరుగుతున్నాయని, అయితే వాస్తవంగా ఐదు గంటలు మాత్రమే పనిచేసిన యంత్రానికి 20 గంటలు పనిచేసినట్లు బిల్లులు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఇప్పటికే అద్దె ప్రొక్లైనర్‌కు లక్షల్లో బిల్లులు చేరుకున్నాయని మున్సిపల్ వర్గాలు పేర్కొంటున్నాయి. శాఖలోని కొందరు ఉద్యోగులు సైతం ఈ వ్యవహారంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. సొంత యంత్రాన్ని వెంటనే మరమ్మతు చేయిస్తే వేలల్లో పూర్తయ్యే ఖర్చును పక్కనబెట్టి, అద్దె పేరుతో లక్షలు వెచ్చించడం వెనుక ఉద్దేశమేంటన్న ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. నిధుల కొరత కారణంగా అనేక అభివృద్ధి పనులు నిలిచిపోయాయని చెబుతున్న అధికారులు, ఇదే సమయంలో అద్దె ఖర్చుల విషయంలో మాత్రం వెనుకాడకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు.మరోవైపు ప్రజాప్రతి నిధులు ప్రతి రూపాయి ప్రజాధనాన్ని పొదుపుగా వినియోగించాలని సూచిస్తుండగా, అధికారుల చర్యలు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే దృష్టి సారించి, సొంత ప్రొక్లైనర్‌ను ఎందుకు వినియోగించడం లేదో, అద్దె బిల్లుల వివరాలపై విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తేవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.




## స్త్రీ నిధిలో పక్కదారి రూ.14.54 లక్షలు అక్రమాలు

-విచారణలో వెలుగులోకి వివోఏ తొలగింపు ..
-ఆఫీస్ బేరర్లపైనా భర్తరఫ్..



సూర్యాపేట జులై 27 వార్త సాక్ష్యం

డీపీఎం బెనర్జీ పై క్రమశిక్షణ చర్యలకు కలెక్టర్ ఆదేశం మహిళా సంఘాల సభ్యులకు అండగా ఉండాల్సిన స్త్రీ నిధి నిధులు పక్కదారి పట్టాయి. సభ్యులు కష్టపడి కట్టిన వాయిదా డబ్బులను విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ తన సొంతానికి వాడుకున్నాడు. ఈ భారీ అవకతవకలు కలెక్టర్ గ్రీవెన్స్ విచారణలో బయటపడటంతో నిందితుడైన వీఓఏపై వేటు పడింది. తుంగతుర్తి మండలం గానుగబండ గ్రామ సమాఖ్యలో అక్రమాలకు పాల్పడినట్లు తేలింది.గానుగబండ గ్రామ సమాఖ్యలో 2022లో స్త్రీ నిధి రుణాలు మంజూరయ్యాయి. సభ్యులు తమ నెలవారీ వాయిదాలను క్రమం తప్పకుండా వీఓఏ సైదులుకు చెల్లిస్తున్నారు. అయితే, సైదులు ఆ డబ్బును పూర్తిగా స్త్రీ నిధి ఖాతాలో జమ చేయకుండా సొంతనికి వాడుకున్నారు. సభ్యుల నుంచి ముందస్తు వాయిదాల పేరుతో భారీగా వసూలు చేసి, బ్యాంకు రికార్డుల్లో మాత్రం కనీస మొత్తమే చెల్లిస్తూ మిగతా సొమ్మును స్వాహా చేశాడు. నిబంధనల ప్రకారం వీఓఏలు ఎలాంటి ఆర్థిక లావాదేవీలు చేయకూడదని రూల్ ఉన్నప్పటికీ, ఇక్కడ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఈ అక్రమాలపై ప్రజావాణిలో ఫిర్యాదులు రావడంతో స్త్రీ నిధి రీజినల్ మేనేజర్ శివప్రసాద్ ఈ ఏడాది మార్చిలో ఎంక్వయిరీ చేశారు. ఈ విచారణలో వీఓఏ సైదులు అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో, అతను స్వాహా చేసిన రూ. 14,54,000 తిరిగి స్త్రీ నిధి ఖాతాలో రీపేమెంట్ చేయించారు. కేవలం వీఓఏ మాత్రమే కాకుండా, ప్రస్తుతం ఉన్న ఆఫీస్ బేరర్లు కూడా ఈ అక్రమలలో సహకరించినట్లు విచారణలో తేలింది. వీఓఏ నిధులు దారి మళ్లిస్తున్నా పట్టించుకోకపోవడం, విచారణ సమయంలో సరిగ్గా స్పందించకపోవడం తో వారిపై కూడా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక అవకతవకలకు పాల్పడిన వీఓఏ సైదులును తక్షణమే విధుల నుంచి తొలగించాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఆఫీస్ బేరర్లను కూడా ఆ పదవుల నుంచి తీసేయాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య ను చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు.

## పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జులై 27 వార్త సాక్ష్యం

వర్షాకాలం దృష్ట్యా మున్సిపల్ పరిధిలోని డివిజన్లు/వార్డులలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్యతో కలిసి మున్సిపల్ కమిషనర్లతో అభివృద్ధి పనుల వేగవంతం, పారిశుధ్య పనుల నిర్వహణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వర్షాకాలంలో సీజనల్ అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పారిశుద్ధ నిర్వహణలో ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా చేపట్టాలని,ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను సేకరించాలని తెలిపారు.మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని తెలిపారు.వార్డులలో వీధి దీపాలు లేని ప్రాంతాలను గుర్తించి వెంటనే ఏర్పాటు చేయాలని,దోమల వృద్ధిని నివారించే విధంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సమన్వయంతో మున్సిపల్ పరిధిలోని ఆసుపత్రులలో అవసరమైన వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉండేలా పర్యవేక్షించాలని తెలిపారు.ప్రజలకు శుద్ధమైన త్రాగునీటిని సరఫరా చేసే విధంగా కార్యాచరణ అమలు చేయాలని,అమృత్ 2.0 పథకం క్రింద చేపట్టిన నీటి ట్యాంకులు,పైప్ లైన్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. నగర అభివృద్ధి నిధులతో కేటాయించిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలోని పన్ను బకాయిలను 100 శాతం వసూలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రజా సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బిజినెస్

## ఫ్లిప్‌కార్ట్‌లో రియల్‌మీ ‘పీ సిరీస్’ హవా అమ్మకాల్లో సరికొత్త రికార్డులు




భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో ప్రముఖ బ్రాండ్ రియల్‌మీ తన పునరాగమనాన్ని ఘనంగా చాటుతోంది. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని విడుదల చేసిన ‘పీ సిరీస్’ స్మార్ట్‌ఫోన్లు అమ్మకాల్లో సంచలనం సృష్టిస్తూ కీలక మైలురాళ్లను అందుకున్నాయి. ఆన్‌లైన్ ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌లో ఈ సిరీస్ అద్భుతమైన పనితీరు కనబరుస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది.ఫ్లిప్‌కార్ట్ గణాంకాల ప్రకారం.. 2026 ప్రథమార్ధంలో ఈ ప్లాట్‌ఫామ్‌పై అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన స్మార్ట్‌ఫోన్ లైనప్‌గా రియల్‌మీ ‘పీ సిరీస్’ నిలిచింది. మార్కెట్ వాటా పరంగా రెండో స్థానాన్ని దక్కించుకుంది. అంతేకాకుండా 2026 జులై 1 నుంచి ఇప్పటివరకు ఫ్లిప్‌కార్ట్‌లో అత్యధికంగా అమ్ముడైన స్మార్ట్‌ఫోన్ సిరీస్‌గా రికార్డు సృష్టించింది. ఇది వినియోగదారుల నుంచి ఈ ఫోన్లకు ఉన్న బలమైన డిమాండ్‌ను స్పష్టం చేస్తోంది.వివిధ ధరల శ్రేణుల్లోనూ రియల్‌మీ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఫ్లిప్‌కార్ట్‌లో రూ.10,000 నుంచి రూ.15,000 ధరల విభాగంలో నంబర్ 1 స్థానంలో నిలిచింది. అలాగే, రూ.15,000 - రూ.20,000, రూ.20,000 - రూ.25,000 సెగ్మెంట్లలోనూ టాప్ 3 బ్రాండ్‌లలో ఒకటిగా స్థానం సంపాదించింది.కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక ప్రకారం.. 2026 రెండో త్రైమాసికంలో భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్ మొత్తం 10 శాతం క్షీణించినప్పటికీ, రియల్‌మీ మాత్రం తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. గతేడాది ఇదే సమయానికి 9.6 శాతంగా ఉన్న తన మార్కెట్ వాటాను 10 శాతానికి పెంచుకోవడం విశేషం.ఈ విజయంపై రియల్‌మీ గ్లోబల్ ప్రొడక్ట్ మార్కెటింగ్ హెడ్ ఫ్రాన్సిస్ వోంగ్ మాట్లాడుతూ.. “పీ సిరీస్ విజయం మా ఈ-కామర్స్ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయి. మా పోర్ట్‌ఫోలియోను సరళీకృతం చేసి, వినియోగదారులకు నచ్చే ఉత్పత్తులపై దృష్టి సారించడం వల్లే ఈ వృద్ధి సాధ్యమైంది. రాబోయే పండుగ సీజన్‌కు ముందు ఇది మాలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది” అని తెలిపారు.

## ఇండేన్ గుడ్‌న్యూస్- బుక్ చేసిన 4 గంటల్లోనే గ్యాస్ డెలివరీ!



ఎల్పీజీ వినియోగదారులకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) కొత్త సేవను అందుబాటులోకి తీసుకొచ్చింది. ‘ఇండేన్ ఎక్స్‌ట్రాలైట్ నా’ పేరుతో తేలికైన 10 కిలోల కాంపోజిట్ గ్యాస్ సిలిండర్‌ను ప్రవేశపెట్టడంతో పాటు, బుక్ చేసిన నాలుగు గంటల్లోనే ఇంటికే డెలివరీ చేసే సేవను ప్రారంభించింది. ప్రస్తుతం ఈ సేవను ఎంపిక చేసిన నాలుగు నగరాల్లో ప్రారంభించినట్లు సంస్థ ప్రకటించింది. సంప్రదాయ ఉక్కు సిలిండర్లతో పోలిస్తే కొత్త 10 కిలోల కాంపోజిట్ సిలిండర్ బరువు తక్కువగా ఉంటుంది. దీంతో దాన్ని మోయడం, తరలించడం, వినియోగించడం మరింత సులభమవుతుందని ఇండియన్ ఆయిల్ తెలిపింది. గృహ వినియోగంతో పాటు చిన్న వ్యాపార అవసరాలకు కూడా ఇది అనుకూలంగా ఉంటుందని పేర్కొంది. బుక్ చేసిన నాలుగు గంటల్లోనే సిలిండర్‌ను ఇంటికే అందించేలా కొత్త సేవను రూపొందించింది. ఈ సేవలో వినియోగదారులకు మరికొన్ని సౌకర్యాలు కూడా కల్పించారు. తమకు అనుకూలమైన డెలివరీ సమయాన్ని ఎంచుకునే అవకాశం కల్పించారు. డిజిటల్ విధానంలో సులభంగా బుక్ చేసుకునే సదుపాయం కూడా అందుబాటులో ఉంటుంది. దీంతో గ్యాస్ బుకింగ్ ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగంగా మారుతుందని సంస్థ తెలిపింది. ప్రస్తుతం పుణే, గురుగ్రామ్, ఇండోర్, కోయంబత్తూరు నగరాల్లో ఈ కొత్త సేవ అందుబాటులో ఉంది. వినియోగదారుల స్పందనను బట్టి త్వరలో మరిన్ని నగరాలకు విస్తరించనున్నట్లు ఇండియన్ ఆయిల్ వెల్లడించింది. అలాగే 5 కిలోల ఇండేన్ ఛోటూ సిలిండర్‌కు కూడా నాలుగు గంటల్లో డెలివరీ సేవను విస్తరించింది. చిన్న కుటుంబాలు, విద్యార్థులు, చిరు వ్యాపారులు ఎక్కువగా వినియోగించే ఈ సిలిండర్‌ను కూడా త్వరగా అందించేలా చర్యలు తీసుకుంది.

## చైనా చిప్ మేకర్ బంపర్ లిస్టింగ్- తొలిరోజే ఇన్వెస్టర్లకు 500 శాతానికి పైగా లాభాలు!




చైనాకు చెందిన మెమొరీ చిప్ తయారీ దిగ్గజం సీఎక్స్‌ఎంటీ కార్ప్ స్టాక్ మార్కెట్లో నూతన చరిత్ర సృష్టించింది. షాంఘై స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో సోమవారం ట్రేడింగ్ ప్రారంభమైన తొలిరోజే ఈ కంపెనీ షేర్లు 500 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేసి ఇన్వెస్టర్లను విస్మయానికి గురిచేశాయి. ఈ అనూహ్యమైన పెరుగుదలతో, చైనాలోనే అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీగా సీఎక్స్‌ఎంటీ అవతరించింది.ఈ ఐపీఓలో ఒక్కో షేరు ధరను 8.66 యువాన్‌లుగా నిర్ణయించగా, మార్కెట్లో 49.50 యువాన్‌ల వద్ద లిస్ట్ అయింది. ట్రేడింగ్ సమయంలో ఒక దశలో షేరు విలువ ఏకంగా 55 యువాన్‌ల స్థాయికి చేరుకుంది. ఈ భారీ ర్యాలీ ఫలితంగా కంపెనీ మార్కెట్ విలువ సుమారు 3.56 ట్రిలియన్ యువాన్‌లకు పెరిగింది. తద్వారా, ఇప్పటివరకు దేశంలోనే అత్యంత విలువైన సంస్థగా ఉన్న ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనా (ఐసీబీసీ)ను సీఎక్స్‌ఎంటీ అధిగమించింది.ఈ ఏడాది ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఐపీఓగా నిలిచిన సీఎక్స్‌ఎంటీ, పబ్లిక్ ఇష్యూ ద్వారా 57.9 బిలియన్ యువాన్‌లను సమీకరించింది. డైనమిక్ ర్యాండమ్ యాక్సెస్ మెమొరీ (డీఆర్‌ఏఎం) చిప్‌ల తయారీలో చైనాలోనే అగ్రగామిగా ఉన్న ఈ సంస్థ, అంతర్జాతీయంగా నాలుగో అతిపెద్ద తయారీదారుగా గుర్తింపు పొందింది. ఈ చిప్‌లను ప్రధానంగా స్మార్ట్‌ఫోన్లు, పర్సనల్ కంప్యూటర్లు, సర్వర్లు, ఏఐ డేటా సెంటర్లలో విస్తృతంగా వినియోగిస్తారు. అమెరికా విధిస్తున్న టెక్నాలజీ ఆంక్షల నడుమ, సెమీకండక్టర్ రంగంలో స్వయం సమృద్ధి సాధించాలన్న చైనా ఆకాంక్షలకు ఈ ఐపీఓ నిధులు వెన్నుముకగా నిలవనున్నాయి. సేకరించిన నిధులను ఉత్పత్తి సామర్థ్యం పెంపుతో పాటు పరిశోధన-అభివృద్ధి కార్యకలాపాలకు వినియోగించనున్నట్లు కంపెనీ వెల్లడించింది.

## ‘ప్లేయర్ ఆఫ్ ది సిరీస్’ అవార్డు నా కల నెరవేరింది: వైభవ్ సూర్యవంశీ




ఇంటర్నెట్ డెస్క్:
జింబాబ్వేతో టీ20 సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిన భారత యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ బీసీసీఐకి ఇంటర్వ్యూ ఇచ్చాడు. తన బ్యాటింగ్ గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. ఈ సిరీస్‌లో రెండు హాఫ్ సెంచరీలు చేసిన వైభవ్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’, ‘ప్లేయర్ ఆఫ్ ది సిరీస్’ అవార్డులు వచ్చిన సంగతి తెలిసిందే. భారత క్రికెట్ చరిత్రలోనే ఈ ఘనత సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా వైభవ్ చరిత్ర సృష్టించాడునా కల నెరవేరింది. నా అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో తొలిసారి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ అవార్డులు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. నా మీద నేను పెట్టుకున్న నమ్మకం వల్లే ఇలాంటి ఇన్నింగ్స్ ఆడగలిగాను. జట్టుకు మంచి ఆరంభం అందించాలనేదే నా లక్ష్యం. మంచి ప్రారంభం లభిస్తే దానిని పెద్ద ఇన్నింగ్స్‌గా మలచాలని ప్రయత్నిస్తాను. హరారేకు వచ్చిన తర్వాత రెండు, మూడు రోజులు మా సన్నాహాలు చాలా బాగా జరిగాయి. అండర్-19 ప్రపంచ కప్‌లో కూడా ఇక్కడే ఆడాను. కెప్టెన్, కోచ్‌లు, జట్టు సభ్యులంతా నాపై నమ్మకం ఉంచారు. వారి మద్దతు ఎంతో ఆనందం ఇచ్చింది’ అని వైభవ్ పేర్కొన్నాడు.

## ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్: భారత షూటర్ల హవా ఈషా సింగ్‌కు స్వర్ణం




ఇంటర్నెట్ డెస్క్: చైనాలోని హాంగ్‌ఝౌలో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ పోటీల్లో భారత షూటర్లు సత్తా చాటారు. 25 మీటర్ల పిస్టల్ విభాగంలో ఈషా సింగ్ పసిడి పతకం సాధించింది. మరోవైపు ఒలింపిక్ పతక విజేత మను బాకర్ కాంస్య పతకం నెగ్గింది. దీంతో ఈ విభాగంలో భారత్‌కు డబుల్ పోడియం లభించింది. 21 ఏళ్ల హైదరాబాద్ షూటర్ ఈషా ఫైనల్లో అసాధారణ ప్రదర్శన కనబర్చింది. 40 హిట్స్‌తో అగ్రస్థానంలో నిలిచింది. కఠినమైన షూట్-ఆఫ్‌ను దాటుకుని పోటీలో నిలిచిన మను బాకర్ చివరకు 28 హిట్స్‌తో కాంస్య పతకాన్ని అందుకుంది. క్వాలిఫికేషన్‌లో మను బాకర్ 586-20ఇ స్కోరుతో అగ్రస్థానంలో నిలవగా, ఈషా సింగ్ 585-18ఇతో రెండో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. అయితే ఫైనల్‌లో మాత్రం మను బాకర్‌ను వెనక్కి నెట్టి ఈషా సింగ్ స్వర్ణం సాధించింది.

**-ఒత్తిడిని జయించా: ఈషా**

స్వర్ణ పతకం సాధించిన అనంతరం ఈషా తన గెలుపుపై మాట్లాడింది. గత ప్రపంచకప్‌లో రికార్డు స్థాయి ప్రదర్శన చేసిన తర్వాత ఈసారి తనపై అంచనాలు పెరిగాయని, వాటిని అధిగమించడమే పెద్ద సవాల్‌గా మారిందని చెప్పింది. ‘మునిచ్‌లో పతకం సాధించిన తర్వాత ఈ పోటీలో ఒత్తిడి మరింత ఎక్కువగా అనిపించింది. విజయాలు పెరిగే కొద్దీ బాధ్యత కూడా పెరుగుతుంది. ఆ ఒత్తిడిని అధిగమించి మరోసారి గెలవడం చాలా ఆనందంగా ఉంది. హాంగ్‌ఝౌ వేదిక నాకు ఎంతో ప్రత్యేకం. 2023 ఆసియా క్రీడల్లో ఇక్కడే నాలుగు పతకాలు గెలిచాను. ఈ రేంజ్, లైటింగ్, వాతావరణం నాకు బాగా తెలుసు. అదే ఫైనల్లో నాకు కలిసొచ్చింది’ అని పేర్కొంది.

# స్పోర్ట్స్

## కామన్వెల్త్ గేమ్స్‌లో రజతం.. ముత్తుపాండికి నజరానా ప్రకటించిన సీఎం విజయ్





ఇంటర్నెట్ డెస్క్:
గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో వెయిట్ లిఫ్టింగ్ 65 కేజీల విభాగంలో రజత పతకం సాధించిన రాజా ముత్తుపాండికి తమిళనాడు ప్రభుత్వం నజరానా ప్రకటించింది. రూ.30 లక్షల నగదు బహుమతిని అందిస్తున్నట్లు తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్ వెల్లడిం చారు. అంతర్జాతీయ వేదికపై అద్భుత ప్రదర్శనతో రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచిన ముత్తుపాండిని విజయ్ అభినందిం చారు.కామన్వెల్త్ గేమ్స్‌లో పురుషుల 65 కిలోల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో రజత పతకం సాధించిన రాజా ముత్తుపాండికి హృదయపూ ర్వక అభినందనలు. ఆయన విజయం తమిళనాడుకు ఎంతో గర్వకా రణం. ఈ ఘనత రాష్ట్ర యువతకు స్ఫూర్తిగా నిలవాలి. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను’ అని సీఎం విజయ్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. తమిళనాడులోని తూత్తుకుడి జిల్లాకు చెందిన రాజా ముత్తుపాండి పురుషుల 65 కిలోల విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. స్నాచ్ విభాగంలో తొలి ప్రయత్నంలో 126 కిలోలు ఎత్తడంలో విఫలమైన అతడు, రెండో ప్రయత్నంలో అదే బరువును విజయవంతంగా ఎత్తాడు. అనంతరం 129 కిలోల ప్రయత్నం విఫలం కావడంతో స్నాచ్‌లో 126 కిలోలతో సరిపెట్టుకున్నాడు. క్లీన్ అండ్ జెర్క్ విభాగంలోనూ తొలి ప్రయత్నంలో 158 కిలోలు ఎత్తలేకపోయిన ముత్తుపాండి.. ఆ తర్వాత పుంజుకుని రెండో ప్రయత్నంలో 160 కిలోలు విజయవంతంగా ఎత్తాడు. దీంతో మొత్తం 286 కిలోల బరువును ఎత్తి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

# రాజకీయాల్లోకి ధనుష్? అభిమానులకు కీలక పిలుపు!



ప్రముఖ నటుడు ధనుష్ తన పొలిటికల్ ఎంట్రీపై మరోసారి ఊహాగానాలకు తెరలేపారు. అభిమానులు తమ ఐక్యతను కేవలం సినిమా వేడుకలకే పరిమితం చేయకుండా, ప్రజా సేవ కోసం ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేయడంతో, ఆయన రాజకీయ రంగ ప్రవేశంపై చర్చ మొదలైంది. ఈ సందర్భంగా ధనుష్ మాట్లాడుతూ "ఇంతమంది ఒకేచోట చేరారు. ఈ ఐక్యతలో గొప్ప శక్తి ఉంది. దానికి ఓ ప్రయోజనం చేకూర్చాలి. కేవలం ఆడియో వేడుకలు, ఫ్యాన్స్ మీట్స్‌కే పరిమితం కాకుండా మనం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేయాలి. మీ ప్రాంతంలోని ప్రజలకు, మీ ఇంటి చుట్టుపక్కల నివసించే కుటుంబాలకు మీకు తోచిన సాయం చేయండి. మిమ్మల్ని చూసి నేను మరింత గర్వపడాలి. మీరు అది చేస్తారని నేను నమ్ముతున్నాను" అని తెలిపారు. ఈ వీడియో వైరల్ కావడంతో 'దళపతి' విజయ్ తర్వాత ధనుష్ కూడా రాజకీయాల్లోకి రాబోతున్నారంటూ సోషల్ మీడియాలో ఫ్యాన్స్ కామెంట్లు చేస్తున్నారు. "తమిళనాడుకు ధనుష్ లాంటి విద్యావంతులు, ధైర్యవంతులైన నాయకులు అవసరం" అని ఒకరంటే, "త్వరలోనే ధనుష్ కొత్త పార్టీ ప్రకటన ఆశించవచ్చు" అని మరొకరు అభిప్రాయపడ్డారు. జాతీయ అవార్డుల విమర్శలపై స్పందన ఇదే కార్యక్రమంలో, జాతీయ అవార్డులపై వచ్చిన విమర్శలపైనా ధనుష్ స్పందించారు. 2024లో తన దర్శకత్వంలో వచ్చిన 'రాయన్' కంటే మెరుగైన తమిళ చిత్రాలు ఉన్నాయని అంగీకరించారు. అయితే, ఒకే ఏడాదిలో ఒక తమిళ నటుడికి రెండు జాతీయ అవార్డులు రావడం గొప్ప విషయమని, దాన్ని అందరూ సెలబ్రేట్ చేసుకోవాలని కోరారు. 'కెప్టెన్ మిల్లర్' చిత్రానికి గాను ధనుష్‌కు స్పెషల్ మెన్షన్ అవార్డు లభించగా, 'రాయన్' ఉత్తమ తమిళ చిత్రంగా ఎంపికైన సంగతి తెలిసిందే.

## లావణ్య పై బాడీ షేమింగ్.. అండగా నిలిచిన మెగా ఫ్యాన్స్



మెగా కుటుంబ కోడలు, నటి లావణ్య త్రిపాఠి తాజాగా బాడీ షేమింగ్‌కు గురయ్యారు. ప్రసవం అనంతరం ఆమె శరీర ఆకృతిలో వచ్చిన మార్పులపై సోషల్ మీడియా వేదికగా కొందరు నెటిజన్లు ప్రతికూల వ్యాఖ్యలు చేయడంతో మెగా అభిమానులు తీవ్రంగా స్పందిస్తున్నారు. ఈ ట్రోల్స్‌ను గట్టిగా తిప్పికొడుతూ లావణ్యకు పెద్ద ఎత్తున మద్దతు తెలుపుతున్నారు. ఇటీవల ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి హాజరైన లావణ్య, మునుపటి కంటే కాస్త బొద్దుగా కనిపించారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు వెలుగులోకి రావడంతో కొందరు నెటిజన్లు ఆమెను లక్ష్యంగా చేసుకుని 'లావుగా అయ్యారు', 'ఆంటీలా కనిపిస్తున్నారు' అంటూ అనుచితంగా వ్యాఖ్యానించారు. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌ను వివాహం చేసుకున్న లావణ్య, 2025 సెప్టెంబర్‌లో మగబిడ్డ (వాయువ్ తేజ్)కు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. అప్పటి నుండి ఆమె సినిమాలకు దూరంగా ఉంటూ తన సమయాన్ని పూర్తిగా మాతృత్వానికే కేటాయిస్తున్నారు. సాధారణంగా ప్రసవం తర్వాత హార్మోన్ల మార్పుల కారణంగా మహిళల శరీర బరువు పెరగడం అత్యంత సహజమైన విషయం. ఈ నేపథ్యంలో, ఒక నూతన తల్లిపై ఇటువంటి విమర్శలు చేయడం శోచనీయమని మెగా అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ప్రసవానంతరం మహిళల శరీరంలో మార్పులు రావడం సహజం. గతంలో ఐశ్వర్య రాయ్, కాజల్ అగర్వాల్ వంటి అగ్ర కథానాయికలు కూడా ఇటువంటి పరిస్థితులను ఎదుర్కొన్నారు. సెలబ్రిటీలైనా, సామాన్యులైనా ప్రసవం తర్వాత తిరిగి సాధారణ స్థితికి చేరుకోవడానికి కొంత సమయం పడుతుంది. ఈ బాడీ షేమింగ్ సంస్కృతికి స్వస్తి పలకాలి" అంటూ వారు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం లావణ్యకు మద్దతుగా మెగా అభిమానులు చేస్తున్న పోస్టులు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్నాయి.

## 'మీ నమ్మకాన్ని ఎప్పటికీ మర్చిపోలేను' విజయ్‌కు అనిరుధ్ భావోద్వేగ సందేశం



తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు విజయ్‌కు సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ కృతజ్ఞతలు తెలిపాడు. 'జన నాయగన్'తో పాటు 'లియో', 'బీస్ట్', 'మాస్టర్', 'కత్తి' చిత్రాల్లో కలిసి పనిచేసిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియాలో భావోద్వేగ పోస్టు చేశాడు. ఈ ప్రయాణం తనకు ఎంతో మధురమైనదని, భావోద్వేగాలతో నిండినదని పేర్కొన్నాడు. "మీతో కలిసి పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. నాపై మీరు ఉంచిన అపారమైన నమ్మకానికి ధన్యవాదాలు. ఈ జ్ఞాపకాలను జీవితాంతం మర్చిపోలేను. మన సంగీతం ఎప్పటికీ జీవిస్తుంది" అని అనిరుధ్ తన పోస్టులో రాసుకొచ్చాడు. ఈ సందర్భంగా విజయ్‌తో కలిసి ఉన్న ఫొటోను కూడా పంచుకున్నాడు. విజయ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తర్వాత విడుదలైన తొలి చిత్రం 'జన నాయగన్'. ఇది విజయ్ నటించిన చివరి సినిమా కూడా. ఇందులో బాబీ డియోల్, పూజా హెగ్డే, మమితా బైజూ కీలక పాత్రలు పోషించారు. తెలుగు చిత్రం 'భగవంత్ కేసరి'కి ఇది రీమేక్‌గా తెరకెక్కింది.



## ఒక్క పోస్ట్‌తో 3 లక్షల మంది ఔట్ చిక్కుల్లో ప్రముఖ యాంకర్



ప్రముఖ నటి, టెలివిజన్ యాంకర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ పియర్లీ మానే సోషల్ మీడియాలో భారీ సంఖ్యలో ఫాలోవర్లను కోల్పోయారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న విద్యార్థుల నిరసనలపై ఆమె చేసిన వ్యాఖ్యలే ఇందుకు కారణమయ్యాయి. కేవలం రెండు రోజుల్లోనే ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో 3 లక్షలకు పైగా ఫాలోవర్లను కోల్పోయినట్లు తెలుస్తోంది. వివాదానికి ముందు పెర్లీ మానీ ఇన్‌స్టాగ్రామ్‌లో సుమారు 27 లక్షల మంది ఫాలోవర్లు ఉండగా, అనంతరం ఆ సంఖ్య 24 లక్షలకు పడిపోయినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అలాగే యూట్యూబ్, ఫేస్‌బుక్ వేదికలపై కూడా పలువురు ఆమెను అన్‌ఫాలో చేస్తున్నట్లు కథనాలు వెలువడ్డాయి. వివరాల్లోకి వెళితే.. విద్యార్థుల నిరసనల నేపథ్యంలో పియర్లీ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. విద్యార్థులంతా సురక్షితంగా ఉండాలని, ఎవరూ గాయపడకూడదని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. "భద్రత ప్రమాదంలో ఉన్నప్పుడు, ప్రాణాలను పణంగా పెట్టేంత గొప్ప ఉద్యమం ఏదీ ఉండదు" అని ఆమె వ్యాఖ్యానించారు. ఈ ఉద్యమం అసలు ఉద్దేశం పక్కదారి పట్టకుండా, విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి సారించాలని కోరారు. అయితే, ఆమె వ్యాఖ్యలు నిరసనల తీవ్రతను నీరుగార్చేలా ఉన్నాయని, అసలు సమస్యలను ప్రస్తావించడంలో ఆమె విఫలమయ్యారని విమర్శలు వెల్లువెత్తాయి. వ్యతిరేకత పెరగడంతో ఆమె తన పోస్ట్ కామెంట్ సెక్షన్‌ను డిసేబుల్ చేశారు. ఈ వివాదం అంతటితో ఆగలేదు. తనను విమర్శిస్తున్న వారిని ఉద్దేశిస్తూ పియర్లీ కొన్ని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలు పోస్ట్ చేశారు. వాటిలో ఒక పోస్టులో 'విఫలమైన దర్శకుడు' ఒకరు తనపై విమర్శలు చేస్తున్నారని పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఆమె వ్యాఖ్యలు ప్రముఖ మలయాళ దర్శకుడు సిబి మలయిల్‌ను ఉద్దేశించినవేనని చాలా మంది భావించారు. మరో స్టోరీలో తనకు ఇష్టమైన రంగు కాషాయం అని, అది జాతీయ జెండాలో ఉందని పేర్కొనడం వివాదాన్ని మరింత పెంచింది. దీనిపై సిబి మలయిల్ కుమారుడు జో సిబి మలయిల్ తీవ్రంగా స్పందించారు. తన తండ్రిని ఉద్దేశించే పియర్లీ ఆ వ్యాఖ్యలు చేశారని, ఇది వ్యక్తిగత దాడి అని మండిపడ్డారు. విద్యార్థులను ఇళ్లకు తిరిగి వెళ్లమని సలహా ఇవ్వడం "అత్యంత తెలివి తక్కువతనం" అని ఆయన విమర్శించారు. మరో నటి మరీనా మైఖేల్ కూడా ఈ వివాదంపై స్పందిస్తూ, ఆన్‌లైన్ విమర్శలను హుందాగా ఎదుర్కోవాలని, వ్యక్తిగత విజయంగా చూడకూడదని సూచించారు. వివాదం ముదరడంతో పియర్లీ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలను డిలీట్ చేశారు. అయితే ఈ విషయంపై ఆమె ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ఈ సంఘటన సోషల్ మీడియాలో ప్రజాభిప్రాయానికి సున్నితమైన అంశాలపై సెలబ్రిటీల వ్యాఖ్యలు ఎంతటి ప్రభావాన్ని చూపుతాయో మరోసారి స్పష్టం చేసింది.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.